సాక్షి నిజామాబాద్

శనివారం । 1 । జూన్ । 2024



ముగ్గురు విద్యార్థులు డిబార్

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో శుక్రవారం ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారు.

- 10లో ▸



హడలెత్తిస్తున్న చోరీలు

ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలతో రైతులు హడలెత్తుతున్నారు. పక్షం రోజుల్లోనే పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాయిల్స్ ఎత్తుకెళ్లారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
42.0 /29.5

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో శుక్రవారం ఇంటర్మీడియట్ కామర్స్, కెమిస్ట్రీ సబ్జెకుతో సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు 6,558 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 6,164 మంది హాజరయ్యారు. 394 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో రవి కుమార్ తెలిపారు. ఉదయం 33 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామని పేర్కొన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దీన్ అస్లాం, దేవరాంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ 28 కేంద్రాలను, డీఐఈవో ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షలకు మొత్తం విద్యార్థులు 3,166 మందికి గాను 2,999 మంది హాజరు కాగా 167 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మొత్తం 37 పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్, సిటింగ్స్ స్క్వాడ్‌లు 30 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, డీఐఈవో ఏడు సెంటర్లను తనిఖీ చేశారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



వర్ని: అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. వర్ని మండలం శ్రీనగర్, సత్యనారాయణపురం, వడ్డేపల్లి, రూపుల నాయక్ తండాల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పనులు జరిగే సమయంలో పంచాయతీరాజ్ అధికారులతో పాటు, విద్యాశాఖ, స్థానిక జీపీ అధికారులు అందుబాటులో ఉండి నాణ్యతను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. అలాగే జాకోరా పంచాయతీలో వర్మి కంపోస్ట్ షెడ్డు, వైకుంఠధామం, నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో శాంత కుమారి, ఎంపీవో చందర్ నాయక్ తదితరులున్నారు.

వచ్చే వారం నుంచి కంబైన్డ్ స్పెషల్ డ్రైవ్

- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీస్ కమిషనరేట్ పరిధిలో వచ్చే వారం నుంచి జిల్లా పోలీస్ శాఖ, ఆర్టీఏ శాఖల ఆధ్వర్యంలో కంబైన్డ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా దిగువ తెలిపిన విధంగా ఉల్లంఘనల మీద దృష్టిసారించి కేసులను నమోదు చేస్తామని తెలిపారు. వాహనాల పత్రాలు సక్రమంగా లేని వారితో పాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతిలేని స్థలాల్లో వాహనాలు పార్కింగ్ చేసినట్లయితే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

జెడ్పీ ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవోగా శ్రీనివాస్



నిజామాబాద్‌రూరల్: జిల్లా పరిషత్ ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవోగా నందిపేట ఎంపీడీవో బి.శ్రీనివాస్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహించిన సుందర వరదరాజన్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆయన 14 రెండు నెలల పాటు జెడ్పీ కార్యాలయంలో డిప్యూటీ సీఈవోగా పని చేశారు. ఆయన పదవీ విరమణతో శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు.

ఎస్సారెస్పీ ఎస్ఈగా శ్రీనివాస్ గుప్తా

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌గా శ్రీనివాస్ గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు ఎస్సారెస్పీ ఎస్ఈగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. దీంతో జగిత్యాల్ ఇరిగేషన్ సర్కిల్‌లోని డివిజన్–5లో ఈఈగా విధులు నిర్వ స్తున్న శ్రీనివాస్ గుప్తాకు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది.



తెలంగాణ ఉద్యమ సమయంలో జిల్లాలో ర్యాలీ నిర్వహిస్తున్న మోతె గ్రామస్తులు(ఫైల్)



తెలంగాణ ఏర్పాటు తర్వాత ముడుపు కట్టిన మట్టిని మోతెకు తీసుకొస్తున్న కేసీఆర్(ఫైల్)

ఇందూరు నుంచే తొలి అడుగు

- బ్యాలెట్ పోరులో నిజామాబాద్ జెడ్పీలో బీఆర్ఎస్‌కు పట్టంగట్టిన ప్రజలు
- ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలవడంలో ఉమ్మడి జిల్లా పాత్ర ఎనలేనిది
- వేల్పూర్ మండలం మోతెలో మట్టితో ముడుపు కట్టిన కేసీఆర్
- ఉద్యమ సమయంలో రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిచిన యెండల లక్ష్మీనారాయణ
- రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించి రేపటికి పదేళ్లు పూర్తి కానుంది. ఈ ప్రస్థానంలో ఉద్యమంలో మొదటి అడుగు వేయడానికి బీఆర్ఎస్‌కు ఉమ్మడి ఇందూరు జిల్లా ఊపు తీసుకొచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ప్రజాపరిషత్‌ను 2001లో బీఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీతో గెలుచుకుంది. అదేవిధంగా భారీగా ఎంపీపీలు, సర్పంచ్ స్థానాలను సైతం బీఆర్ఎస్ గణనీయంగా గెలుచుకుంది. దీంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా ఇందూరు జిల్లా ప్రజలు పునాదులు వేశారు. ఈ క్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ మండలంలోని మోతె ప్రజలు మొదటిసారిగా బీఆర్ఎస్ ఎంపీటీసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మోతె గ్రామాభివృద్ధి కమిటీ సొంత ఖర్చులతో ఉమ్మడి జిల్లాలోని మండలాలు, గ్రామాలు తిరిగి తెలంగాణ సాధన కోసం ప్రచారం చేశారు. దీంతో ఉద్యమం ఎగిసి బీఆర్ఎస్ ఏకంగా జిల్లా ప్రజాపరిషత్‌ను కైవసం చేసుకుంది. 2001 మే 4న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మోతెకు వచ్చారు. 'తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ మోతె.. ఏకగ్రీవంగా టీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలికి ప్రజాప్రతినిధులను ఇచ్చి అక్కున చేర్చుకున్న మోతె గ్రామ ప్రజల రుణం తీర్చుకోలేనిది. మోతె మట్టిని చేతబట్టి చెబుతున్న.. మూట గట్టి తీసుకెళ్తున్న'.. తిరిగి తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాతే మోతె గ్రామానికి వస్తా.. మళ్లీ ఆ మట్టి మూటను మీ గ్రామస్తుల మధ్యే విప్పి ఈ నేలను ముద్దాడి వెళ్తా. మీరిచ్చిన స్ఫూర్తితో వెళ్తున్న. రాష్ట్రం తీసుకునే వస్తా అని కేసీఆర్ చెప్పారు. చెప్పిన ప్రకారం కేసీఆర్ 2014 మార్చి 27న మోతెకు వచ్చి ముడుపు విప్పారు. ఇదిలా ఉండగా 2004 ఏప్రిల్ 13న డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో కేసీఆర్ అమరవీరుల స్థూపం ఆవిష్కరించారు.

■ బీఆర్ఎస్ పార్టీ 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించింది. జిల్లాకు చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, ఎం.నారాయణరెడ్డి, వేముల సురేందర్‌రెడ్డి, డాక్టర్ బాపురెడ్డి, ఈగ సంజీవరెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, ఏఎస్ పోశెట్టి పార్టీ ఆవిర్భావం నుంచి ఉద్యమంలో తిరుగులేని పాత్ర పోషించారు. ఉద్యమం ఉవ్వెత్తున నడిచిన సమయంలో 2009 డిసెంబర్ 28 నుంచి 2014 ఫిబ్రవరి 23వ తేదీ వరకు సుదీర్ఘకాలం పాటు నిజామాబాద్‌లో రిలే దీక్షలు జరిగాయి. సబ్బండ వర్ణాలు ఉద్యమంలో పాల్గొన్నాయి. అలాగే కేసీఆర్ వెయ్యి కార్లతో హైదరాబాద్ నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు చేసిన ర్యాలీలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.



■ 2004లో కాంగ్రెస్ పొత్తుతో బరిలోకి దిగిన బీఆర్ఎస్ నుంచి ఆర్మూర్‌లో శనిగరం సంతోష్‌రెడ్డి, డిచ్‌పల్లిలో గడ్డం గంగారెడ్డి, ఎల్లారెడ్డిలో ఏనుగు రవీందర్‌రెడ్డి గెలిచారు. 2009లో టీడీపీ పొత్తుతో పోటీచేసిన బీఆర్ఎస్ నుంచి ఎల్లారెడ్డిలో ఏనుగు రవీందర్ రెడ్డి గెలిచారు. ఆ సమయంలో జిల్లాలో టీడీపీ ఐదు చోట్ల, కాంగ్రెస్ ఒక చోట, బీజేపీ ఒక చోట, ప్రజారాజ్యం ఒక చోట గెలిచాయి. ఇక 2014లో ఉమ్మడి జిల్లాలోని 9 స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. 2018లో ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ గెలవగా, మిగిలిన 8 చోట్ల బీఆర్ఎస్ గెలిచింది. 2023లో మాత్రం బీఆర్ఎస్ బాల్కొండ, బాన్సువాడ స్థానాల్లో మాత్రమే గెలిచింది. కాంగ్రెస్ బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి స్థానాల్లో విజయం సాధించింది. కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించడంతో ఇందూరు జిల్లా పేరు జాతీయ స్థాయిలో మార్మోగింది.



భూపతిరెడ్డి

■ ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేల్లో తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి మాత్రమే. కాంగ్రెస్ నుంచి భూపతిరెడ్డి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అయ్యారు. ఇదిలా ఉండగా 2009లో నిజామాబాద్ అర్బన్ నుంచి అప్పటి పీసీసీ అధ్యక్షుడు డీఎస్‌పై బీజేపీ తరఫున యెండల లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్సార్ మరణం తర్వాత 2010లో తెలంగాణవాదం వినిపించేందుకు గాను యెండల తన ఎమ్మెల్యే పదవికి 8 నెలల కాలానికే రాజీనామా చేసి మళ్లీ పీసీసీ అధ్యక్షుడు డీఎస్‌పైనే విజయం సాధించారు.



యెండల లక్ష్మీనారాయణ

గ్రూప్‌-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- 41 కేంద్రాల్లో హాజరుకానున్న 12,833 మంది అభ్యర్థులు
- సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్: జూన్ 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 12,833 మంది అభ్యర్థులు గ్రూప్–1 పరీక్ష రాయనుండగా, వారి కోసం 41 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు ముందుగా ఆయా కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు పరిశీలించాలని సూచించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..

గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నందున అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎంఆర్ పద్ధతిలో జరుగుతుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతిస్తామని, ఉదయం పది గంటలకు మెయిన్ గేట్లు మూసేస్తారని తెలిపారు. అభ్యర్థులు బయోమెట్రిక్ పద్ధతిన తమ గుర్తింపును నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, లేనిపక్షంలో అభ్యర్థుల పరీక్ష పత్రాలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిగణనలోకి తీసుకోదని స్పష్టంచేశారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్ రావు, డీఈవో దుర్గాప్రసాద్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకుడు పవన్, డీఐఈవో రవికుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై కేసు నమోదు చేయండి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఏవోకు మెమో జారీచేయాలని ఆదేశం

బోధన్‌టౌన్(బోధన్): స్టాక్ నిల్వలో తేడాతో పాటు, ఎరువులు అమ్మిన బిల్లులు సక్రమంగా నమోదు చేయని ఎరువుల దుకాణం డీలర్‌పై కేసునమోదు చేయాలని, ఎరువుల దుకాణాలను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏవోకు మెమో జారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బోధన్‌లోని రెండు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వల రిజిస్టర్లను, ఇతర వివరాలను పరిశీలించారు. స్టాక్ నిల్వలో తేడాలు ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే వ్యవసాయ శాఖ ఏవో ఎందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణంపై కేసు నమోదు చేయాలని, ఏవోకు మెమో జారీచేయాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి వాజీద్ హుస్సేన్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన బృందాలతో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. నాసిరకం, నకిలీ విత్తనాల కారణంగా ఎక్కడ ఏ ఒక్క రైతు నష్ట పోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో రెండు రోజుల్లో అన్ని దుకాణాల్లో తనిఖీలు చేసి పూర్తి వివరాలతో కూడిన నివేదికను అందించాలని ఆదేశించారు. నకిలీ ఎరువులు, విత్తనాలు రైతులకు విక్రయిస్తే సహించేది లేదని, రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



బోధన్‌లోని ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న మౌలిక వసతుల కల్పన పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ సూచించారు. పట్టణంలోని బురుడు గల్లీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా విత్తన అభివృద్ధి సంస్థ అధికారి శ్రీకర్, ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్, సీఐ వీరయ్య, కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ గంగాధర్, ఆర్ మేహరానంద్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

సమష్టి పెట్రోలింగ్‌తో సత్ఫలితాలు

- అడవుల రక్షణకు ప్రత్యేక నిఘా
- వారానికోసారి సిబ్బందితో క్షేత్రస్థాయి సందర్శన
- ఆదర్శంగా నిలుస్తున్న ఇందల్వాయి రేంజ్



ఇందల్వాయి ఫారెస్టులో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్న ఎఫ్ఆర్వో రవిమోహన్ భట్

డొంకేశ్వర్(ఆర్మూర్): అడవుల రక్షణ కోసం ఇందల్వాయి రేంజ్ పరిధిలో అధికారులు తమ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్నారు. అందరితో కలిసి సమష్టిగా కాలినడకన పెట్రోలింగ్ చేయడం వలన సత్ఫలితాలు వస్తున్నాయి. ఇందల్వాయి రేంజ్ పరిధిలో ఉన్న మండలాల అడవుల్లో వన్యప్రాణుల వేట, అడవుల నరికివేత, భూముల ఆక్రమణకు చాలా వరకు అడ్డుకట్ట పడింది. ఈ విధమైన పెట్రోలింగ్ ద్వారా అడవులపై నిఘా పెట్టడంతో పాటు ఉద్యోగులకు కూడా అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై పూర్తి అవగాహన వస్తోంది. వారానికోసారి అడవుల్లో క్షేత్రస్థాయి సందర్శన చేపట్టి ఇందల్వాయి రేంజ్ మిగతా రేంజ్‌లకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పవచ్చు. జిల్లా వ్యాప్తంగా 86,871.45 హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. అడవులను సంరక్షించడానికి జిల్లాలో నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, ఇందల్వాయి, వర్ని, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, సిరికొండ రేంజ్‌లు ఉన్నాయి. అయితే, అత్యధికంగా ఇందల్వాయి రేంజ్‌లోనే 22,748.41 హెక్టార్ల అటవీ విస్తర్ణం ఉంది. ధర్పల్లి, డిచ్‌పల్లి, మాక్లూర్, జక్రాన్‌పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల పరిధిలో ఎక్కువ అడవులున్నాయి. ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రవిమోహన్ భట్ అడవులపై ప్రత్యేక నిఘా ఉంచారు. డీఎఫ్ఆర్వోలు, సెక్షన్ ఆఫీసర్లు, బీటర్ ఆఫీసర్లు, బేస్ క్యాంపు సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు ఫారెస్టులో టీం వర్క్ చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో అడవుల నరికివేత, వన్యప్రాణుల వేట, పోడు భూముల ఆక్రమణ కేసులు నమోదు కావడం లేదు.

మిగతా రేంజ్‌లు కూడా అనుసరిస్తే..

ఇందల్వాయి రేంజ్‌లో మాదిరిగానే జిల్లాలో మిగతా ఆరు రేంజ్‌ల అధికారులు, సిబ్బంది కూడా సమష్టిగా పెట్రోలింగ్ చేస్తే అడవులపై గట్టి నిఘా ఉంటుందని చెప్పవచ్చు. ఇందల్వాయి తర్వాత కమ్మర్‌పల్లి, సిరికొండ, నిజామాబాద్ సౌత్, వర్ని లాంటి రేంజ్ పరిధిలో కూడా అటవీ విస్తీర్ణం ఎక్కువగానే ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అడవుల నరికివేత, జంతువుల వేట, పోడు భూముల ఆక్రమణ సంఘటనలు తరుచుగా చోటు చేసుకుంటున్నాయి. ఫారెస్టు సిబ్బంది అంతా వారానికోసారి కొన్ని కిలోమీటర్ల మేర పెట్రోలింగ్ చేస్తే వీటికి అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మిల్లర్ల మాయాజాలం.. అధికారుల సస్పెన్షన్..

- జిల్లాలో చర్చనీయాంశమైన డీఎస్‌వో, డీఎంలపై వేటు
- మాజీ ఎమ్మెల్యే షకీల్ వ్యవహారంతోనే అధికారుల మెడకు ఉచ్చు?

సుభాష్‌నగర్: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చంద్రప్రకాశ్, సంస్థ జిల్లా మేనేజర్ జగదీశ్ కుమార్ సస్పెన్షన్ వ్యవహారం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకేరోజు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడంతో ఆ శాఖలో కలకలం రేగింది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయడం, సీఎంఆర్ సేకరించడంలో నిర్లక్ష్యం, తదనంతరం జరిగిన పరిణామాలతో వారిపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ వేటు వేశారు. మిల్లర్ల మాయాజాలంపై ప్రభుత్వం, ఆ శాఖ మంత్రి, కమిషనర్ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో 2021–22, 2022–23 సంవత్సరంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన మిల్లులకు సామర్థ్యం లేకున్నా.. పరిమితికి మించి కేటాయింపులు చేశారనే ఆరోపణలు వచ్చాయి. వాటికి సంబంధించి సీఎంఆర్ బియ్యం సేకరణలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. షకీల్ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తన మిల్లులకు ధాన్యాన్ని పరిమితికి మించి కేటాయింపులు చేయించుకున్నారని విమర్శలున్నాయి. ఇందుకు సంబంధించిన సుమారు 37వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కలు అధికారులు చూపడం లేదు. వీటి విలువ సుమారు రూ. 72 కోట్లకుపైనే ఉంటుందని అంచనా.



ఇన్‌చార్జి డీఎస్‌వో, డీఎంల నియామకం..

జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా కమిషనరేట్‌లోని పద్మ, పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా మేడ్చల్ మల్కాజిగిరి డీఎం జి.రాజేందర్ నియమితులయ్యారు. జిల్లా డీఎస్‌వో, డీఎం సస్పెండ్ కావడంతో తాత్కాలికంగా వారిని ఇన్‌చార్జీలుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ప్రభుత్వం మారడంతో..

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత పౌరసరఫరాలశాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంఆర్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ బియ్యం, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, తదితర అంశాలపై స్పెషల్ ఫోకస్‌పెట్టారు. రైస్‌మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరించాలని జిల్లా అధికారులపై ఒత్తిడి పెంచారు. ఆ సమయంలో బోధన్ చుట్టుపక్కల ఉన్న రైస్‌మిల్లులకు జరిగిన కేటాయింపులు, రికవరీపై దృష్టిపెట్టారు. దీంతో అప్రమత్తమైన షకీల్ ఎన్నికలకు ముందే అధికారాన్ని అడ్డు పెట్టుకుని తన మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని ఫలానా మిల్లులకు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా బదలాయించినట్లు యజమానులతో ఒప్పించారు. కానీ ఎక్కడ కూడా ధాన్యం మిల్లులకు తరలించలేదు. కేవలం అధికార బలంతో ఒప్పించారనే ఆరోపణలున్నాయి. తీరా అధికారం కోల్పోయిన తర్వాత తనకేం సంబంధం లేదన్నట్లుగా షకీల్ తప్పించుకోవడంతో.. మిగతా మిల్లర్ల మెడకు ఉచ్చు బిగుసుకుంది. దీనికితోడు కొందరు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ పెద్దలు కూడా అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇష్టారీతిన సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు. సీఎంఆర్ విషయంలో కాలయాపన చేస్తూ వచ్చారు.

'కామారెడ్డి' వైస్ చైర్‌పర్సన్‌గా వనిత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతనెల 15న వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రంగనాథ్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ సాగింది. బల్దియాలో 49 మంది సభ్యులుండగా.. సమావేశానికి 30 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఉర్దొండ వనిత పేరు ప్రకటించగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు.

క్లుప్తంగా

బీడీ టేకేదార్లతో చర్చలు సఫలం



ఖలీల్ వాడి: బీడీ టేకేదార్లతో చర్చలు సఫలమైనట్లు బీడీ కమీషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయినాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య తెలిపారు. శుక్రవారం ఓ హోటల్లో బీడీ టేకేదార్ సంఘాలు, బీడీ యాజమాన్యాలతో బీడీ టేకేదార్ల కమీషన్‌పై చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో బీడీ యాజమాన్యం సంఘం రాష్ట్ర అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయులు, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ, దేశాయి బీడీ కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ రస్మీకాంత్, టెలిఫోన్ కంపెనీ జనరల్ మేనేజర్ రామన్‌బాయి, చర్‌బాయి బీడీ కంపెనీ నుంచి పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు. ఇప్పటికీ వరకు వెయ్యి బీడీలకు ఉన్న కమీషన్ రేటు రూ.4.50 పెరిగిందన్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇది అమలులోకి వస్తుందన్నారు. ఏప్రిల్ నెల బకాయిలు, జూలై నెలలో ఇస్తారని చెప్పారు.

మహిళతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన స్థానికులు

రామారెడ్డి: రామారెడ్డి గ్రా మానికి చెందిన ఓ మహి ళతో అసభ్యకరంగా ప్రవర్తించిన రామారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అ ధ్యక్షుడు వడ్ల ఆనంద్‌పై పోలీసులు గురువారం రా త్రి కేసు నమోదు చేశారు. ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆనంద్‌ను ఆ మహిళ ప్రతిఘటించడంతో చుట్టుపక్కల వారు పట్టుకొని చితకబాది పోలీస్ స్టేషన్లో అప్పగించారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆనంద్‌పై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆనంద్‌కు సంబంధించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, మహిళకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వడ్ల ఆనంద్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా అధికారికంగా సస్పెండ్‌కు సంబంధించిన ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

పొగాకు వాడటం అంటే క్యాన్సర్ కొని తెచ్చుకోవడమే



నిజామాబాద్‌అర్బన్: పొగాకు ఉత్పత్తులు వినియోగించడమంటే క్యాన్సర్‌ను కొని తెచ్చుకున్నట్లేనని మేఘన దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రతాప్ కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ము ఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పొగాకు ఉపయోగిస్తే ఎదురయ్యే అనర్థాలు, క్యాన్సర్ బారిన పడడానికి ఉన్న అవకాశాలు, పొగాకు, అనుబంధ ఉత్పత్తులకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. వైద్యులు ప్రద్యుమ్నరెడ్డి, ప్రవీణ్ కుమార్, సాయి చంద్, రవీంద్రనాథ్ సూరి, రోహిత్, సంస్కృతి, ప్రియ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బీబీపేట: అదనపు కట్నం కోసం మహిళను భర్త, అత్త మామలు వేధిస్తున్న ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన సౌజన్యను సదాశివనగర్‌కు చెందిన సుతారి నవీన్‌కు ఇచ్చి 2020లో పెళ్లి చేశారు. కొన్ని రోజులుగా అదనపు కట్నం, బంగారం తేవాలని ప్రతిరోజు వేధిస్తున్నారని, పెద్దల సమక్షంలో చాలా సార్లు నచ్చజెప్పినప్పటికీ వినడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా అత్త రాజమణి, మామ సుధాకర్ సైతం విపరీతంగా బంగారం తెమ్మని హింసిస్తున్నారని, వారి నుంచి సౌజన్య రక్షణ కోరినట్లు ఎస్సై తెలిపారు.

హడలెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

- పక్షం రోజులలో పది ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాయిల్స్ చోరీ చేసిన దొంగలు
- ఆందోళన చెందుతున్న రైతులు



లింగంపల్లి కలాన్, తాండూర్ శివారులో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్ చోరీలు ఎక్కువయ్యాయి. జనాలు లేని నిర్మానుష్య ప్రాంతాలను, ప్రధాన రహదారుల వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు మండలాల పరిధిలో పక్షం రోజులలో పది ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్‌తో పాటు ఆయిల్‌ను చోరీ చేశారు. దీంతో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు నష్టం వాటిల్లింది. దొంగలు నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్, ధర్మారెడ్డి, వెంకంపల్లి, ఎర్రారం, రాఘవపల్లి, గోపాల్‌పేట్, తాండూర్, ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్, అడివిలింగాల గ్రామశివారులో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీ చేశారు.

కాపర్ కాయిల్స్, ఆయిల్‌కు భారీ రేటు..

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కాపర్ కాయిల్స్, ఆయిల్ రేటు బాగా ధర ఉండడంతో దొంగలు దీని వెంట పడుతున్నారని రైతులు అంటున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో రూ.30 వేల విలువ చేసే కాపర్ కాయిల్స్‌తో పాటు, 200 లీటర్ల వరకు ఆయిల్ ఉండడం ఇది లీటర్ రూ.200 వరకు ఉండడంతో దీని వెంట పడుతున్నారని అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్స్ చోరీ కాకుండా అధికారులు చర్యలను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్స్ చోరీ కాకుండా చర్యలు తీసుకోవాలి. దీని వల్ల రూ.30 వేల నుంచి 60 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. దీంతో పాటు నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ లేక రైతులు ఇబ్బందుల పాలు కావాల్సి వస్తున్నది.

– సాయిలు, రైతు, లింగంపల్లికలాన్, నాగిరెడ్డిపేట

ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ కాకుండా చూడాలి

ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్ చోరీ కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ కాకుండా కొత్త విధానాన్ని ఏర్పాటు చేయాలి. అలా అయితేనే చోరీని నివారించగలం.

– పోచయ్య, మాచాపూర్, ఎల్లారెడ్డి మండలం

యాంటీ థెఫ్ట్ బోల్ట్‌లను ఏర్పాటు చేస్తున్నాం

జిల్లాలో పదిహను రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీకి గురయ్యాయి. చోరీని నివారించేందుకు యాంటీ థెఫ్ట్ నట్ బోల్టులను తెప్పించాం. రోడ్డు పక్కన ఉన్న వాటికి యాంటీ థెఫ్ట్ బోల్టులను బిగించడంతో పాటు జిల్లా కేంద్రం నుంచి పంపించే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు యాంటీ థెఫ్ట్ బోల్టులను బిగించి పంపిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌లలో కాపర్ కాయిల్స్ చోరీకి గురి కాకుండా అల్యూమినియం కాయిల్స్‌ను వినియోగిస్తున్నాం. ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశాం.

– రమేష్‌బాబు, ఎస్ఈ, ట్రాన్స్‌కో, కామారెడ్డి

భౌతికం టు గణితం..

- భౌతిక శాస్త్రం బోధించే టీచర్లు గణిత బోధన చేయాలని ఉత్తర్వులు
- వ్యతిరేకిస్తున్న టీచర్లు

నిజామాబాద్‌అర్బన్: గణిత శాస్త్రం సబ్జెక్టును భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బోధించాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 6, 7 తరగతులకు గణితాన్ని భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడంతో ఉపాధ్యాయ సంఘం నాయకులు, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. తెలంగాణ విద్యాశాఖ భౌతిక, రసాయనం శాస్త్రం పట్ల చిన్నచూపు చూడడం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు గణిత బోధనకు పరిమితం చేయడం చాలా దురదృష్టకరమని సంబంధిత సబ్జెక్టు టీచర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే విద్యాశాఖ కార్యదర్శి విడుదల చేసిన 1143 మెమోను వెంటనే సవరించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 శాతం గణిత ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నప్పటికీ గణిత శాస్త్రం చెప్పే ఉపాధ్యాయులకు గణితాలు ఇవ్వకుండా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు బలవంతంగా బోధించాలని చెప్పడం సమంజసం కాదని విమర్శలు వస్తున్నాయి. వారానికి ఐదు తరగతుల చొప్పున పాఠ్యాంశాలు బోధించాలంటే చాలా కష్టమని సంబంధిత టీచర్లు పేర్కొంటున్నారు. తెలంగాణలో 60 శాతం పైచిలుకు ప్రధానోపాధ్యాయులు గణిత బోధన చేసిన వారి ప్రాథమిక నిబంధన ప్రకారం ప్రధానోపాధ్యాయులు వారానికి 8 తరగతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయినా ప్రధానోపాధ్యాయులకు కూడా ఆరవ తరగతి ఏడవ తరగతి కేటాయించకుండా బలవంతంగా భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు చెప్పించాలని ఇచ్చిన ఉత్తర్వులు ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంటున్నారు. గణిత ఉపాధ్యాయులకు 8, 9, 10 తరగతులకు మాత్రమే బోధించమని పక్షపాత వైఖరి రాష్ట్ర విద్యాశాఖ యోచించడం సరైంది కాదని పేర్కొంటున్నారు. నేటి పరిస్థితులలో గణిత శాస్త్రం కంటే అత్యంత ప్రాముఖ్యమైన సబ్జెక్టు భౌతిక, రసాయన శాస్త్రం. ఉపాధ్యాయులు ఎంత చెప్పినా తక్కువగానే ఉంటుంది కాబట్టి భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు గణిత బోధనల నుంచి తొలగించి ఆరు నుంచి పదవ తరగతి వరకు ఉన్న భౌతిక రసాయన శాస్త్ర అంశాలను వేరు చేసి కేవలం భౌతిక రసాయన శాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశాలను బోధించడానికి మాత్రమే పరిమితం చేయాలంటున్నారు.

ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. భౌతిక శాస్త్రమే బోధించాలి. లేదంటే నిరసనలు చేస్తాం. రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కలిసి విన్నవిస్తాం. ఇది సరైన నిర్ణయం కాదు.

– శివప్రసాద్, భౌతిక, రసాయన శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

సరైన నిర్ణయం కాదు

భౌతిక శాస్త్రాన్ని సంబంధిత టీచర్లే బోధించాలి. ప్రాథమిక స్థాయిలో ఉన్నత స్థాయిలో వారికి ప్రత్యేక స్థానం ఉంది. భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు గణితం బోధించడం సరైంది కాదు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులను కలిసి విన్నవించనున్నాం.

– వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వర్మి కంపోస్టు తయారీ విధానంపై నైపుణ్య శిక్షణ



శిక్షణకు హాజరైన రైతులతో శాస్త్రవేత్తలు

రుద్రూర్: మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శుక్రవారం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, అగ్రికల్చర్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్మి కంపోస్ట్ విధానంపై రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ టి.అంజయ్య మాట్లాడుతూ.. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సస్య రక్షణ విభాగం శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉందన్నారు. శిక్షణ కార్యక్రమం మూడు రోజులు పాటు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ప్లేస్మెంట్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



ఖలీల్ వాడి: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని సీపీ కల్మేశ్వర్ అన్నారు. శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న సిబ్బందిని సీపీ కల్మేశ్వర్ తన కార్యాలయంలో సన్మానించారు. ఏర్గట్ల ఏఎస్సై సయ్యద్ ఇస్మాయిల్, ఆరవ టౌన్ ఏఎస్సై మహ్మద్ ఖాన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటరమణ పదవీ విరమణ పొందారు. వీరికి పదవీ విరమణ సందర్భంగా సర్టిఫికేట్లు(జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ వీడ్కోలు సందర్భంగా అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, శంకర్ నాయక్, ఏఈ శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొని ఉమ్మడ ఆశన్న(65) అనే వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు.. ఉమ్మడ ఆశన్న తన తోట నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో అదే రోడ్డులో వస్తున్న టిప్పర్ వెనుక వైపు తగిలి టైర్ కింద పడిపోయాడు. దీంతో ఆశన్న అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆగి ఉన్న లారీ ఢీకొని మరొకరు..

ఆర్మూర్‌టౌన్: చేపూర్ సమీపంలో 63వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో పల్లపు నర్సయ్య(63) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన నర్సయ్య పెర్కిట్‌లో సమీప బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో తన బంధువుకు చెందిన ఒకరి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా వాహనం నడుపుతున్న నగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని పడిగెల రణవీర్(36) అనే యువకుడు మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన రణవీర్ నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. పనులు ముగించుకుని బైక్‌పై నిర్మల్ వెళ్తుండగా రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన రణవీర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. భార్య హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తిరుపతిలో జిల్లావాసి గుండెపోటుతో మృతి



చాడేకర్ రూపమ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన చాడేకర్ రూపమ్(31) తిరుపతిలో గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు..రెండు రోజుల క్రితం రూపమ్ అతడి స్నేహితులు కారులో తిరుపతికి బయలుదేరారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లి దర్శనం టికెట్ కోసం క్యూ లైన్‌లో ఉన్న రూపమ్ అర్ధరాత్రి ఒక పక్క ఛాతీ నొప్పుందంటూ ఒక్కసారిగా కుప్పకూలాడని ఆయన వెంట ఉన్న స్నేహితులు తెలిపారు. వెంటనే టీటీడీ సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినప్పటికి రూపమ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రూపమ్ మృతదేహాన్ని తిరుపతి నుంచి మద్నూర్‌కు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. సాయంత్రం మద్నూర్‌లో రూపమ్ అంత్యక్రియలు నిర్వహించారు. 3 నెలల కిందట రూపమ్ వివాహం జరిగింది. అంతలోనే గుండెపోటుతో మృతి చెందడం ప్రతి ఒక్కరిని కలచివేసింది. రూపమ్ అకాల మృతితో మద్నూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు



మార్క వినయ్

మోర్తాడ్(బాల్కొండ): దొన్కల్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన మార్క వినయ్(16) అనే బాలుడు మరణించగా.. బైక్‌పై ఉన్న మరో యువకుడు కోరవెల్లి శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. వినయ్ తన పుట్టిన రోజు వేడుకలు నిజామాబాద్‌లో గురువారం చేసుకుని శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై మోర్తాడ్ వస్తుండగా.. ట్రాన్స్‌పోర్ట్ వాహనం ఆర్మూర్ నుంచి మంచిర్యాల్ వైపు వెళుతుంది. వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో పాటు అతి వేగంగా వాహనం నడపడటంతో బైక్‌ను ఢీకొని వాహనం రోడ్డు ప్రక్కన పడిపోయింది. డ్రైవర్, క్లీనర్‌లకు కూడా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మొదట నలుగురు గాయాల పాలు కాగా అందరిని 108 వాహనంలో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. వినయ్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

రెంజల్(బోధన్): దూపల్లి గ్రామానికి చెందిన ఆకుల మహేశ్(29) అనే యువకుడు స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు.. గత రెండు సంవత్సరాలుగా మహేశ్ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ మద్యానికి బానిసైనట్లు తండ్రి అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు రాత్రి అయినా ఇంటికి రాలేదని, శుక్రవారం స్థానిక చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా తమ కుమారుడిదని నిర్ధారించుకున్నట్లు తండ్రి సాయిలు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.


పోలీస్‌స్టేషన్ తనిఖీ



సీపీకి గౌరవ వందనం చేస్తున్న స్థానిక పోలీసులు

వేల్పూర్: వేల్పూర్ పోలీ స్‌స్టేషన్‌ను జిల్లా సీపీ కల్మేశ్వర్ శుక్రవారం తనిఖీ చేశారు.వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన స్టేషన్ ఆవరణను,రికార్డులు పరిశీలించారు. ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఐపీఎస్‌లు శేషాద్రిరెడ్డి, చైతన్యరెడ్డి,ఏసీపీ బస్వారెడ్డి,ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

'పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు'



వినతి పత్రం అందిస్తున్న లగ్నేశ్వరి

బోధన్: తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రెండేళ్ల పాటు సహజీవనం చేసి పాప పుట్టిన తర్వాత ఇదే గ్రామానికి చెందిన సతీష్ మోసం చేశాడని వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ లగ్నేశ్వరి ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట నిరసన తెలిపి అధికారికి వినతి పత్రం అందించారు. తనకు నాలుగు నెలల పాప ఉందని, సతీష్ ఆయన కుటుంబ సభ్యులు తన కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



బ్రాహ్మణపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎడపల్లి(బోధన్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి, ఏఆర్పీ క్యాంప్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే పూర్తయ్యావాటిని పూర్తిగా తొలగించి చేపట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ నిధులను వృథా చేయకూడదన్నారు. ఇంజనీరింగ్ అధికారులు అధిక మొత్తంలో అంచనాలను రూపొందించడం సరికాదన్నారు. ఆయన వెంట డీఈవో దుర్గాప్రసాద్, బోధన్ ఆర్డీవో, ఎంపీడీవో శ్రీనివాస్, స్థానిక నాయకులు ప్రమీల, సాయిలు, సయ్యద్ ఉన్నారు.

ముగ్గురు విద్యార్థులు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శుక్రవారం 1,228 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిశిత కామర్స్ డిగ్రీ కాలేజ్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సీఎస్ఐ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాల్లో ఒక్కొక్కరి చొప్పున ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,400 మంది విద్యార్థులకు గానూ 7,840 మంది, మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,709 మంది విద్యార్థులకు గానూ 8,038 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఉమ్మడి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.



నిజామాబాద్‌లోని డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్

బీర్లలో చెత్తా చెదారం

- బార్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కస్టమర్లు



చెత్తను చూపిస్తున్న కస్టమర్

ఎల్లారెడ్డి: రెస్టారెంట్‌లలో కస్టమర్లకు పాడైపోయిన వస్తువులతో తయారు చేసిన ఆహారం అందిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్న సమయంలో బార్‌లలో విక్రయిస్తున్న బీర్లలో సైతం చెత్తా చెదారం రావడంతో మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సంగీత బార్ అండ్ రెస్టారెంట్‌లో అన్నాసాగర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, కాశీరాంలు బీరు తాగేందుకు రాగా బీర్‌లో చెత్త చెదారం కనిపించడంతో బార్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బీర్లను విక్రయించడంతోనే ఇలాంటి ఘటన చోటు చేసుకుంటున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి బార్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని ఇకపై ఇలాంటి బీర్లు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై బార్ నిర్వాహకులను వివరణ కోరగా.. బీర్‌లో చెత్త వచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు. చెత్త వచ్చిన బీర్లను తిరిగి కంపెనీకి పంపినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నాగేంద్ర(ఫైల్)

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఆప్కా నాగేంద్ర(18) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. రెండు రోజుల క్రితం మెండోరా మండలం బుస్సాపూర్ శివారులో జాతీయ రహదారి–44 పై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో నాగేంద్ర తీవ్ర గాయాలపాలయ్యాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృత్యువాత పడ్డాడు. కారు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి అభిరాం ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ..

ఖలీల్‌వాడి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నాగారంలోని 300 క్వార్టర్స్‌కు చెందిన నాగలక్ష్మి(38) అనే మహిళ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ తెలిపారు. గత ఆదివారం కుటుంబ కలహాలతో నాగలక్ష్మి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి..

బీబీపేట: ఫిట్స్ మందులు అతిగా తీసుకొని 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మెట్టు స్వామి(37) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు.. మెట్టు స్వామి(37)కి రాజంపేటకు చెందిన నవ్యతో వివాహం కావడంతో భార్యతో కలిసి రాజంపేటలోనే నివాసం ఉంటున్నాడు. భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో ఈ నెల 28న బీబీపేటలోని తన సొంత ఇంటికి వచ్చాడు. 29న గ్రామంలోని విజయ డైరీ వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించి స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఫిట్స్ మందులు ఎక్కువగా తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు. 2 రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కొన్నేళ్లుగా ఫిట్స్ వస్తుంటాయని, దానికి తోడు భార్యతో గొడవల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.